క్లుప్తంగా

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో ఏవీ కళాశాల విద్యార్థులు బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని సూచించారు.

ఆలయ అభివృద్ధికి రూ.1,11,111 విరాళం



అధ్యక్షుడు వెంకటేశం గుప్తాను సన్మానిస్తున్న ఉపసర్పంచ్ ప్రవీణ్

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో గల శ్రీఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన కేతావత్ గోపాల్ నాయక్ రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు. అదేవిధంగా ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఉప్పల వెంకటేశం గుప్తా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన అధ్యక్షుడితో పాటు దాతను స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్, ఉపసర్పంచ్ ప్రవీణ్‌గౌడ్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, రవి నాయక్, జి.కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని గోపాల్‌ముదిరాజ్, సంపత్‌గౌడ్‌లు అన్నారు. భవానీ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బుధవారం బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మైలవరపు భవానీ దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బండారు రామలక్ష్మి, బండారు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

రాయదుర్గం: రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని రూపొందించిన కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు శ్యామ్లెట్ గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరేశ్, నర్సింహ, పాండు, సంజీవ, నర్సింహరాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పండుగ ప్రతి ఒక్కరికి ఆనందాలు తెచ్చే పండుగ అన్నారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముస్లింలకు ఎంతో పవిత్రమైనవన్నారు. పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు హిందూ, ముస్లింల మధ్య ఉన్న స్నేహ సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ శ్రీనివాస్ దాసు, మైత్రి కమిటీ అధ్యక్ష కార్యదర్శి ఎస్.రాజు వస్తాద్, ఆబేద్, అక్బర్, శ్రీకాంత్‌చారి, ఖైరుద్దీన్, జంగయ్య, ఎంఏ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గోల్కొండ: ప్రైవేటు పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు మరింత క్రమశిక్షణతో ముందుకు సాగుతామని ఆల్ ఇండియా ఐడీఎల్ టీచర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు మహ్మద్ అలీ సోహేల్ అన్నారు. బుధవారం టోలిచౌకి వీనస్ హైస్కూల్‌లో గోల్కొండ, షేక్‌పేట్, ఆసిఫ్‌నగర్ మండలాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. షేక్‌పేట్ డివిజన్ ఐటా అధ్యక్షుడిగా మహ్మద్ ఇజాహెత్ అలీఖాన్, కార్యదర్శిగా నవీద్ బాషా, కోశాధికారిగా సయ్యద్ జమాల్ ఖాద్రీ, మహిళా కన్వీనర్లుగా వసీం ఉన్నీసా, నజుమా సుల్తానా.. ఆసీఫ్‌నగర్ మండల అధ్యక్షుడిగా హబీబ్‌షేక్, కార్యదర్శిగా ఇర్ఫాన్‌బేగ్, కోశాధికారిగా ఎండీ.సోహేల్.. గోల్కొండ మండల అధ్యక్షుడిగా షేక్ అజ్మత్, కార్యదర్శిగా ఎండీ మహమూద్ హుస్సేన్ తదితరులు ఎన్నికయ్యారు.

ఉగాది పర్వదినం
షడ్రుచుల సమ్మేళనం



రాజేంద్రనగర్ సర్కిల్‌లో భక్తిశ్రద్ధలతో శోభకృత్ నామ సంవత్సర వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాంగ శ్రవణాన్ని వినిపించిన వేద పండితులు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పండగ వైభవం ఉట్టిపడేలా హిందువులంతా సంప్రదాయ దుస్తులు ధరించి ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అనంతరం పులుపు, కారం, ఉప్పు, తీపి, చేదు, వగరు వంటి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, భక్షాల వంటి పిండి వంటలు చేసి ఇష్టదేవుళ్లకు నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. అనంతరం సమీపంలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్నేహితులు, బంధువులకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం వేళల్లో ఆలయాల వద్ద అర్చకులు చదివిన పంచాంగాన్ని భక్తితో కూర్చొని విన్నారు. ఈ ఉగాది ఉత్సవాల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం



బండ్లగూడ: కిస్మత్‌పూర్ హనుమాన్‌లో నిర్వహించిన పంచాంగ పఠనంలో మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వెంకటేష్, ఆలయ చైర్మన్ నిరుడు శేఖర్‌ముదిరాజ్, గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు లంకల నిఖిల సంగారెడ్డి, అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, గోకరి అర్జున్‌గౌడ్ తదితరులు



రాజేంద్రనగర్: హైదర్‌గూడలోని అలిపోచమ్మ ఆలయంలో జరిగిన పంచాంగ పఠనంలో ఆలయ కమిటీ సభ్యులు



రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి పంచాంగ శ్రవణంలో..



మణికొండ: సంకట హర హనుమాన్ ఆలయంలో పంచాగ శ్రవణంలో..



రాజేంద్రనగర్: హైదర్‌గూడ జనప్రియలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది ఉత్సవాల్లో మల్లారెడ్డి, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపాలిటీ ఓల్డ్ విలేజ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: వేసవి కాలంలో బయట తిరిగే వారికి ఉపయోగపడేలా పలువురు సామాజిక సేవకులు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం శుభపరిణామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌లు అన్నారు. బుధవారం ఉగాది పండగను పురస్కరించుకుని వట్టినాగులపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్‌పర్సన్, నార్సింగిలో తను ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అశోక్‌యాదవ్‌లు ప్రారంభించి మొదటి రోజు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలతో వేలాది మందికి మేలు జరుగుతుందన్నారు. ఈ ఏడాది మరిన్ని కూడళ్లలో సేవాపాదులు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మణికొండలో వీఫర్‌యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో గోల్డన్ టెంపుల్ సర్కిల్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మొదటి రోజు మజ్జిగను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు ఉషారాణి, లక్ష్మీప్రవళిక కిరణ్, బి.యాదమ్మ, పత్తి ప్రవీణ్‌కుమార్, నాయకులు నగేష్‌యాదవ్, రాము, వినోద్ కుమార్, వెంకటేశ్, డి.కిరణ్, వీఫర్‌యు సంస్థ అధ్యక్షుడు బాపూజీ, ప్రధాన కార్యదర్శి డి.సీతారాందాస్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో చలివేంద్రాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



వట్టినాగులపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ రేఖయాదగిరి



మణికొండలో చలివేంద్రాన్ని ప్రారంభించిన వీ ఫర్‌యూ సంస్థ ప్రతినిధులు

పోచమ్మ ఆలయ ముఖ ద్వారానికి శంకుస్థాపన

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి బాబుల్‌రెడ్డినగర్‌లోని పోచమ్మ దేవాలయ ముఖ ద్వారం ఏర్పాటు పనులకు బుధవారం భూమి పూజ చేశారు. వేదపండితులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఈ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ, సోమ శ్రీనివాస్, లక్ష్మయ్యగుప్తా, కిష్టప్ప, లక్ష్మణ్, కుమార్, శ్రీనివాస్, శంకర్, మహేష్, శ్రీను, గోపాల్‌నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ముఖ ద్వారం శంకుస్థాపన పూజలో భక్తులు

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలను ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆదుకుంటుందని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మణికొండ క్వార్టర్స్‌కు చెందిన రేవతికి రూ.32వేలు, దీపకకు రూ.18,200ల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ వసంతరావు, సీనియర్ నాయకుడు పి.జంగయ్య, జి.జయరాజ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పొంగిన డ్రైనేజీ... రోడ్డంతా మురుగుమయం

మధురానగర్ ప్రధాన రోడ్డుపై అధ్వాన్న పరిస్థితి



రాయదుర్గం: డ్రైనేజీ పొంగింది. ప్రధానరోడ్డును ముంచెత్తింది. దీంతో వాహనదారులు దుర్వాసనతో ఇక్కట్లు పడుతూ రాకపోకలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. గచ్చిబౌలి డివిజన్ మధురానగర్ ప్రధాన రహదారిపైకి మురుగునీరంతా మురుగుకాలువల నుంచి పొంగి పొర్లి ప్రధాన రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. నగరం నుంచి ఔటర్‌రింగురోడ్డు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఐటీకారిడార్, నార్సింగి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గాలిదొడ్డివెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డుకు నిత్యం ఎంతో ప్రాధాన్యత నెలకొంది. దీంతో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన రోడ్డుపైకి మురుగు నీరంతా వచ్చి చేరి రాకపోకలకు ఇక్కట్లు కలిగిస్తున్నా....దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వెంటనే మురుగునీరు ప్రధాన రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా డ్రైనేజీ వ్యవస్థ పొంగకుండా తగిన చర్యలు అవసరమని వారు కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ 20 ఏళ్ళ క్రితం నిర్మాణం చేయగా అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణం చేశారని, అప్పటికీ, ఇప్పటికీ ఇళ్ల సంఖ్య పెరగడంతో మురుగుకాలువలను ఆధునీకరించడంతోపాటు విశాలంగా మార్చాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

శివరాంపల్లిలో ఘనంగా బోనాలు



మల్లన్నకు పూజలు చేస్తున్న సదాల శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని మల్లన్న స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామునే మల్లన్న స్వామికి అభిషేకంతో పూజలను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఉగాది రోజున మల్లన్న స్వామికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ప్రజలు బోనాన్ని కుటుంబ సమేతంగా తీసుకువచ్చి మల్లన్న స్వామికి సమర్పించారు. మధ్యాహ్నం జరిగిన పూజలో రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్ఆర్‌టీపీ యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని మల్లన్నకు బోనం సమర్పించారు. బోనాల నేపథ్యంలో ఆలయాన్ని వివిధ పూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ప్రధాన రహదారిపై ఈ ఆలయం ఉండటంతో రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాలిదొడ్డిలో చలివేంద్రం ప్రారంభం

రాయదుర్గం: గాలిదొడ్డిలోని అంబేద్కర్ గాలిదొడ్డి డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ చలివేంద్రాన్ని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తుండడంతో ప్రజల దాహార్తిని తీర్చేవిధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.



సీనియర్ నాయకులు రమేష్, కృష్ణ, నర్సింహ్మా, బాలకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

మణికొండ: తల్లి మందలించడంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సమరంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మీనాక్షి (18) తన తల్లితో కలిసి నార్సింగిలో నివాసముంటోంది. మతిస్థిమితం సరిగా లేని ఆమె తల్లి బుధవారం కూతురును మందలించింది. మనస్తాపం చెందిన మీనాక్షి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

మణికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు కె.రాములు వెంకటయ్యలకు 100 కాల్ నుంచి ఫోన్ రావడంతో పీరం చెరువు కమాన్ వద్దకు వెళ్లారు. అక్కడ ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అక్కడకు వచ్చిన 108 సిబ్బంది అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. అతను మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో అతడి వివరాలు తెలియలేదని, అతడికి సంబంధించిన వారు ఉంటే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

యమ డేంజర్.. సర్వీసు రోడ్డులోని స్పీడ్ బ్రేకర్..

ఓ విద్యార్థి మృతి, మరో ముగ్గురికి గాయాలు

శంషాబాద్: రాళ్లగూడ సమీపం ఔటర్ సర్వీసు రోడ్డుపై ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్‌తో ఒక్క రోజులోనే మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం రాత్రి ఉగాది పండగ కోసం ఇంటికి వెళ్తున్న కొత్తూరుకు చెందిన బీటెక్ విద్యార్థి స్పీడ్ బ్రేకర్ వద్ద జారి పడి తీవ్ర గాయాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం కూడా దంపతులు వెళ్తున్న బైక్‌తో పాటు మరో ద్విచక్ర వాహనదారుడు జారీ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ ఒకే చోట అతిపెద్దగా ఉండటంతో వాహనదారులు గమనించక ప్రమాదానికి గురై గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.